క్లుప్తంగా

రామాలయాన్ని ఢీకొట్టిన కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో అర్ధరాత్రి సమయంలో కారు అదుపుతప్పి రామాలయాన్ని ఢీ కొట్టింది. దీంతో కారు పూర్తిగాను, రామాలయం స్వల్పంగాను దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. కారు అతివేగంగా వచ్చి గుడి గోడను బలంగా ఢీ కొట్టడంతో అందులో ఉన్న ఐదుగురిలో ముగ్గురు గాయపడ్డారు. ఇద్దరు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న అయిదుగురిలో నలుగురు అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన వారు కాగా ఒకరు పాశర్లపూడిలంకకు చెందిన యువకుడిగా స్థానికులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో యువకులు మద్యం తాగి ఉన్నారని స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై స్థానికులు నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దీనిపై విచారణ చేపట్టారు.

ఇన్‌చార్జి ఈఓగా సత్యనారాయణ



మామిడికుదురు: జిల్లా ఎండోమెంట్స్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వి.సత్యనారాయణ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈఓగా సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయన చార్జ్ తీసుకుని బాలబాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఇంతవరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ ఈఓగా పనిచేసిన ముదునూరి సత్యనారాయణరాజు వ్యక్తిగత కారణాలతో 45 రోజులు సుదీర్ఘ సెలవు పెట్టడంతో అతని స్థానే డీఈఓ సత్యనారాయణను ఇక్కడ ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇతను అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓగానూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మలికిపురం: స్థానిక వారధి ఫౌండేషన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మలికిపురంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కారణంగా బాటసారులకు మజ్జిగ అందిస్తున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శృంగారపు బాబు, దొంగ శివకృష్ణ, కర్రా మల్లికార్జునరావు, ఆచంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టౌన్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో లక్కవరం గ్రామానికి చెందిన కిడ్నీ పేషెంట్ ఆదుర్తి సుశీలకి ఆర్థిక సాయం అందించారు. రెండు కిడ్నీలు పాడయిన ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్టీఆర్ ఫ్యాన్స్ అండగా నిలిచారు. ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.20 వేలను ఆమెకు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మలికిపురం ఎస్సై పీవీఎస్ఎన్ సురేష్ చేతుల మీదుగా అందించారు. మంగిన నాని, మలికిపురం సఖినేటిపల్లి మండలాల టౌన్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ చెల్లుబోయిన నాని, పిల్లి బాచి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న ఎస్సీ విద్యార్థులు

మామిడికుదురు: అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో భాగంగా ఆదుర్రు గ్రామ పరిధిలోని మోరిపాలంలో మంగళవారం జరిగిన సభలో మండలంలోని 11 జెడ్పీహెచ్ స్కూల్స్‌లో పదో తరగతిలో ప్రతిభ చూపిన ఎస్సీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు అందించారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదు, మెమెంటో అందజేశారు. బళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు దాకే హర్ష, యల్లమెల్లి నానాజీ, కొల్లాబత్తుల బెన్నీరాజు, భూపతి శరత్, వై.శ్రీహర్ష, కొంబత్తుల రాంజీ సుమన్, పిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు

పి.గన్నవరం: బాల కార్మికులను గుర్తించేందుకు రాజోలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివ నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం మండలంలో మంగళవారం ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించింది. విద్యాశాఖ, పోలీస్, ఐసీడీఎస్ సిబ్బందితో కలసి పి.గన్నవరంలోని షాపులను, వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. ఎక్కడా బాల కార్మికులుగా గుర్తింపబడలేదు. మల్లేశ్వరరావు వ్యాపారులతో మాట్లాడుతూ బాలకార్మిక చట్టంపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని బాలలతో పనిచేయించడం నేరమన్నారు. బాలతో పనిచేయిస్తే ఈ చట్టం ప్రకారం రూ.50 వేలకు పైబడి జరిమానా విధిస్తామని, జైలు శిక్ష కూడా పడుతుందని ఆయన వివరించారు.

అమ్మవారి జాతర

రావులపాలెం: మండలంలోని ఊబలంక గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా గ్రామంలోని చిన్నపిల్లలతో తల్లిదండ్రులు దివిటీలు వేయించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏటా అమ్మవారి జాతరను ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం తీర్థం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

దక్కని అపరాలు

- వర్షాలకు కుళ్లి.. ఎండలకు ఎండి
- చనిపోయిన మొక్కలు
- రూ.15 కోట్లకు పైగా నష్టపోయిన రైతులు



అంతర్వేదిపాలెం గ్రామంలో చనిపోయిన అపరాల మొక్కలు

మలికిపురం: వేసవిలో అపరాల సాగు రైతులకు మంచి ఆదాయం తెస్తుంది. అయితే గత పదేళ్లుగా అపరాల సాగు రైతులను జెల్ల కొడుతుంది. అకాల వర్షాలు అపరాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రస్తుతం అనువుగాని వాతావరణంతో పాటు అకాల వర్షాలు కూడా రైతులను ముంచేశాయి. అసలే గత కొంత కాలంగా ఇక్కడ పంటల సాగు సమయంలో తీవ్ర వ్యత్యాసం వస్తున్న సంగతి పాఠకులకు విదితమే. ఈ వ్యత్యాసం ప్రస్తుత దాళ్వా నాటికి మరింత అధికమైంది. అపరాలు వేసే సమయం కూడా మించిపోయింది. ప్రస్తుత వేసవిలో రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో వరి కోతలు అయిన వెంటనే అపరాల విత్తనాలు చల్లారు. మినుము, పెసలు, ఇతర పశుగ్రాసం విత్తనాలు చల్లారు. సుమారు 8 వేల ఎకరాల్లో మినుము, పెసలు చల్లారు. మొక్కలు మొలిచినా వాతావరణ అననుకూలత వల్ల 20 శాతం చేలలో అవి ఎదుగుదల లేదు. మిగిలిన 80 శాతం చేలు పూర్తి స్థాయిలో ఏపుగా పెరుగుతున్న సమయంలో అకాల వర్షాలు ముంచెత్తాయి. పూర్తి స్థాయిలో చేలు మునిగిపోవడం వల్ల అనేక ఎకరాల్లో అపరాల చేలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు వర్షాలకు మునిగిన చేలలో నీరు వారం రోజులుగా కాస్తున్న ఎండలకు మరిగిపోయి కూడా మొక్కలు చని పోయాయి. చనిపోతున్న, గిడసబారిన అపరాల చేలను చూసుకుని రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా అసలు అపరాల సాగు జోలికి వెళ్లని రైతులు కూడా ప్రస్తుతం చాలా మంది ఉన్నారు. దీనికి ప్రధాన కారణం అకాల వర్షాల భయమే. గత పదేళ్లుగా అపరాల చేలు అకాల వర్షాల ధాటికే తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుత ఏడాది కూడా వారిని వర్షం వెంటాడింది. ఈ కారణంగా కూడా 25 శాతం మంది రైతులు అపరాల సాగు జోలికి వెళ్లలేదు. ధైర్యం చేసి సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. అపరాల సాగు వల్ల రైతులు చన్నీళ్లకు వేడి నీళ్ల సాయంగా ప్రతి ఏడాది కొంత ఆదాయం పొందుతారు. ఎకరానికి రెండు బస్తాల నుంచి నాలుగు బస్తాల అపరాలు ఇక్కడ పండుతాయి. అంటే ఎటువంటి పెట్టుబడి లేకపోయినా 40 రోజుల వేసవి పంట విరామ కాలంలో ఎకరం భూమిలో సుమారు రూ.30 వేలకు పైబడి రైతులు ఆదాయం పొందుతారు. అయితే ప్రస్తుత ఏడాది వాతావరణం అనుకూలించక పోవడం ఎండల తీవ్రత తదితర కారణాల వల్ల అపరాల సాగు దెబ్బతింది. ఈ నియోజకవర్గాల్లో ప్రస్తుత వేసవిలో సుమారు రూ.15 కోట్లకు పైగా ఆదాయాన్ని రైతాంగం కోల్పోయిందని అంచనా. అలాగే చేలలో చల్లిన అపరాల గింజల పెట్టుబడి కూడా పోయింది.

అకాల వర్షాలు ముంచాయి



అకాల వర్షాల వల్ల అపరాల మొక్కలు నీటి మునిగి చనిపోయాయి. అలాగే మిగిలిన మొక్కలు గిడసబారి పోయాయి. పెట్టుబడి తక్కువ అయినా ఆదాయం బాగుండే పంట ఇది. రైతులకు ఎకరానికి రూ.30 వేలకు పైగా నష్టపోయాం.

– నల్లి గంగన్న, రైతు, దిండి

వర్షాలకు ఎండలు తోడు



అకాల వర్షాలు పడిన వెంటనే ఎండలు తీవ్రమయ్యాయి. వర్షాలకు మునిగి చనిపోగా మిగిలిన మొక్కలు చేలో నీరు ఎండలకు మరిగిపోయి చనిపోయాయి. ఈ విధంగా ఎండలు, వానలు కూడా మమ్మల్ని ముంచాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– తోట గాలిబాబు, రైతు, ఉయ్యూరి వారి మెరక

కిశోర బాలికల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన



కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శాంతకుమారి



వాడపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతకుమారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కోనసీమ జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ శాంతకుమారి, పి.గన్నవరం ప్రాజెక్టు సీడీపీఓ విజయ్ శ్రీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కిశోర బాలికల్లో ధైర్యం నింపారు. వారు శారీరక దృఢత్వం కలిగి ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా అక్రమాలు, బాలికలపై జరిగే వేధింపులు, చట్టాలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా కిశోర బాలికలు, వారి తల్లులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్వైజర్లు రామలక్ష్మి, విజయగౌరీ, జయ వాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు, అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది

కొత్తపేట: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు కె.నాగమణి, కె.చంద్రకళ అన్నారు. సీడీపీఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు కిశోరి వికాసం–2 కార్యక్రమాల్లో భాగంగా మోడేకుర్రులో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన, వాడపాలెంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ‘బాల్యవివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు–నివారణ’పై కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, నాగమణి మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితరాలపై అవగాహన కల్పించారు. కిశోరి బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కేలు షబానా సుల్తాన్‌బేగం, రామతులసి, డీసీపీయూ అరుణ, బాలికలు, వారి తల్లిదండ్రులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



మగటపల్లిలో ట్యాంకరు ద్వారా తాగునీరు సరఫరా

మామిడికుదురు: ఈదరాడ ప్రాజెక్టు పరిధిలోని మూడు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఈదరాడ, మగటపల్లి, కొమరాడ గ్రామాలకు ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ మంగళవారం తెలిపారు. ఈదరాడ ప్రాజెక్టు పరిధిలో నీటి నిల్వలు నిండుకోవడంతో నాలుగు గ్రామాలకు తాగునీటి సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయి. దీనిలో ఆదుర్రు గ్రామానికి పాశర్లపూడి ప్రాజెక్టు ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు.

మిగిలిన మూడు గ్రామాలకు గ్రామ పంచాయతీల ద్వారా తాగునీరు అందిస్తున్నామని ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు తెలిపారు. పంట కాలువలకు నీరు విడుదల చేశారని చెప్పారు. కాలువ నీరు అందుబాటులోకి రాగానే ఈదరాడ చెరువులోకి లిఫ్ట్ చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ తెలిపారు. అప్పటి వరకు మూడు గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ట్యాంకర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

తహసీల్దార్‌పై జరిగిన దాడికి ఖండన



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తహసీల్దార్ల సంఘ జిల్లా నాయకులు

అయినవిల్లి: జిల్లాలో ఉన్న తహసీల్దార్లు అందరూ కలసి ఇటీవల అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. మంగళవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తికి ఆ మండలంలో భూములు లేకపోయినా, అతనికి సంబంధించిన పనులేమీ కార్యాలయంలో పెండింగ్‌లో లేనప్పటికీ కక్ష పూరితంగా వచ్చి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ఆర్‌ఎస్‌ఏ, ఏపీ జేఏసీఅధ్యక్షుడు డి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన బండారు విజయ్‌కుమార్ కుటుంబం మంగళవారం రూ.25 వేల విరాళం అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు దాత విజయ్‌కుమార్ అందజేశారు. దాతను వేదమంత్రాలతో అర్చకులు శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. విరాళం అందించిన దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

న్యాయం చేయాలని భాషా పండితుల వినతి

మామిడికుదురు: భాషా పండితుల న్యాయబద్ధమైన కోర్కెలను అర్థం చేసుకుని వాటిని నెరవేర్చాలని కోరుతూ ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. బలవంతపు బదిలీలను నిలుపుదల చేయాలని, ప్రమోషన్లు కల్పించాలని, తమకు శాశ్వత స్థానాలు కల్పించాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లాంగ్వేజ్ పండిట్స్ ప్రతినిధులు కోళ్ల సుజాత, కాశిన అన్నపూర్ణ, కొల్లు సుజాత తదితరులు ఎమ్మెల్సీని కలసి తమ సమస్యలను విన్నవించారు. తమ సమస్యలను డీసీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారన్నారు. తెలుగు భాషా దినోత్సవం బహిరంగ సభలో తమకు న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చినా ఇంత వరకు ఆ హామీ నెరవేరలేదన్నారు. తమ కోర్కెలను నెరవేర్చాలని కోరారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

సఖినేటిపల్లి: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ఉమిద్ (వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు 2025) చట్టంపై సుప్రీంకోర్టు సరైన నిర్ణయం తీసుకుంటుందని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం అంతర్వేదిపాలెం చంగల్‌తోట ఏరియాలో జామియా మసీదులో రాజోలు నియోజకవర్గ ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ మహమ్మద్ జానీ అధ్యక్షతన రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై చర్చ ఏర్పాటు చేశారు. మైనారిటీ సమాజంపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే సచార్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంస్కరణను లౌకిక వాదులు, రాజ్యాంగ వాదులు వ్యతిరేకించాలని ఆయన కోరారు. పేద ముస్లింలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని ఆయన ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నాయకులు అబ్దుల్ రహీం, మహమ్మద్ కబీర్, ఏక్ మీరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం



దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న భక్త దంపతులు

కొత్తపేట: స్థానిక బొరుసువారి సావరంలో వేంచేసిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం, దుర్గామల్లేశ్వరస్వామి దివ్యతిరు కల్యాణం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణకర్త, ఆలయ పోషకుడు బొరుసు వెంకట ఉదయభాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల బ్రహ్మత్వాన పలు పూజలు నిర్వహించారు. రాత్రి లోక కళ్యాణార్థం సామూహిక దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు దివ్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుమారు 30 మంది దంపతులు కన్యాదాతలుగా నిలిచి కల్యాణం జరిపించారు. ముఖ్యంగా కన్యాదాన ఫలితాన్ని వివరించారు. అటువంటిది దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు స్వయంగా కల్యాణం జరిపించడం, కల్యాణంలో పాల్గొనడం ఎంతో అదృష్టమన్నారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాక్షిపై కక్ష సాధింపు తగదు



అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం ఇస్తున్న విలేకరులు



పి.గన్నవరం పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు

రావులపాలెం: సాక్షి మీడియాపై టీడీపీ శ్రేణులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం సాక్షి కొత్తపేట జోన్ ఇన్‌చార్జ్ జగత రాంబాబు, రావులపాలెం రిపోర్టర్ కొవ్వూరి ఆదినారాయణరెడ్డి రావులపాలెంలో రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సాక్షిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఖండించారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు.

మలికిపురం: రాజానగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపైన, ఉద్యోగులు, పాత్రికేయులపై దాడి చేయడం తగదని మలికిపురం మండల పాత్రికేయులు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ మలికిపురం పోలీస్‌స్టేషన్లో మంగళవారం పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు వెలివెల సందురరావు బాపూజీ, తోట సత్యనారాయణ, కారుపల్లి శ్రీనివాస్ తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

మామిడికుదురు: రాష్ట్ర వ్యాప్తంగాసాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మామిడికుదురు ప్రెస్ క్లబ్ అసోసియేషన్ తరఫున మంగళవారం నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ‘సాక్షి’ కార్యాలయాలపై దాడులకు పాల్పడడం, పేపరు ప్రతులను దగ్ధం చేయడం, అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ఎస్‌డీ దుర్గాప్రసాద్, ప్రతినిధులు యేడిద బాలకృష్ణ, అమీర్ హసన్, తోరం సత్యనారాయణ, హరిబాబు, బొమ్మిడి హరిబాబు పాల్గొన్నారు.

అంబాజీపేట: సాక్షి యూనిట్ కార్యాలయాల వద్ద సోమవారం టీడీపీ నాయకుల ధర్నా, దాడి చేయడం అప్రజాస్వామికమని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, సాక్షి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ మట్టపర్తి రాము, జర్నలిస్టులు కోన సత్తిబాబు, దంగేటి సోమేష్‌లు డిమాండ్ చేశారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. సాక్షి టీవీలో సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను వెంటనే కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించి క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు మంచిది కాదని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పోలీసులకు అందజేశారు.

పి.గన్నవరం: సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పి.గన్నవరం పోలీస్ స్టేషన్లో మీడియా ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. సాక్షి కార్యాలయాలకు, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ దాడులను ఖండించారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు టీకే దుర్గాశంకర్, జి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించాలి

మామిడికుదురు: యోగాను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పాశర్లపూడి సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి పేర్కొన్నారు. పాశర్లపూడి చింతలమెరకలో మంగళవారం యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పురాతన కాలం నుంచి మన పెద్దలు యోగాను ఆచరించే వారని గుర్తు చేశారు. అందుకే పూర్వం అనారోగ్య సమస్యలు పెద్దగా ఉండేవి కాదన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ యోగా ఎంతో అవసరమన్నారు. యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసిక సమస్యలను అధిగమించాలన్నారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జి.వాసు, ఏఎన్ఎంలు జీవీఆర్ కుమారి, భూలక్ష్మి, యానిమేటర్లు వరలక్ష్మి, పైడావతి, నాగలక్ష్మి, పార్వతి, పంచాయతీ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ యోగా అభ్యాసన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పది కాలాల పాటు పదిలంగా ఉంటుందని జిల్లా వెటర్నరీ డీఏహెచ్‌ఓ కె. వెంకట్రావు అన్నారు. ఆలమూరు వెటర్నరీ ఏడీ కార్యాలయం వద్ద ఏడీ ఎల్.అనిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఏహెచ్‌ఓ వెంకట్రావు ప్రారంభించగా ప్రముఖ యోగా నిపుణుడు, రిటైర్డ్ వెటర్నరీ డీడీ కె.రామ కోటేశ్వరరావు యోగాసనాలను నేర్పించారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: ప్రస్తుత విభిన్న వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి ఎ.సూర్యనగేష్ అన్నారు. మాచవరం సచివాలయం–4లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. జ్వరాలకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు డయాలసిస్, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం ఎం.అర్జమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

48 మందికి కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 48 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐదుగురికి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

పి.గన్నవరం: విధి నిర్వహణలో ఉద్యోగులు అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పి.గన్నవరం, ముంగండ బ్రాంచి మేనేజర్లు కోట అశోక్ కోబ్రగడే, సుమలత అన్నారు. స్థానిక బ్రాంచిలో పనిచేస్తూ బదిలీ అయిన స్పెషల్ అసిస్టెంట్ సాయిదీప్ శరత్‌ను బ్రాంచి సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సత్కరించారు. ఖాతాదారులకు శరత్ మెరుగైన సేవలు అందించారని పలువురు అభినందించారు. ఆయన్ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ ఆంజనేయులు, ఆర్టీఓ సుభాష్, బీసీ బద్దే శ్రీను, ఖాతాదారులు పాల్గొన్నారు.

134 పింఛన్ల మంజూరు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు 134 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఎ.రాజు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ భర్త పింఛన్‌ను తీసుకుంటుండగా మృతి చెందిన భార్య (స్పౌజ్)కు ఈ పింఛన్ మంజూరైందన్నారు. ఈ నెలలో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. మండల ఏఓ ఎం.మెహెర్ ప్రకాష్, సీఏ షేక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ పరిధిలోని బాడిలంకలో పంచాయతీరాజ్ రోడ్డు అభివృద్ధి పనులకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. లూటుకుర్రు శివాలయం నుంచి పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీ వరకు అక్కడి నుంచి బాడిలంక ఏటిగట్టు వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.రెండు కోట్లతో రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. లూటుకుర్రులో నిర్మించిన గోకులం షెడ్డును కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. సభలో మాట్లాడుతూ పాడైపోయిన రోడ్లను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

తొత్తరమూడిలో..

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం భూమి పూజ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు.

ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా అల్లు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా అల్లు భవాని మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. స్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న ముదునూరి సత్యనారాయణరాజు సెలవులపై విదేశాలకు వెళ్లారు. ఆయన స్థానంలో ద్రాక్షారామలో చేస్తున్న అల్లు వెంకట దుర్గాభవాని అదనపు బాధ్యతలు స్వీకరించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఆలమూరు: మండలంలోని పెనికేరులో అగ్నిప్రమాదంలో అన్ని విధాలా నష్టపోయిన గోపు శ్రీనివాసు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. స్థానిక మోదుకూరు రోడ్డులో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల పాక, గడ్డివాము దగ్ధం కావడంతో పాటు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్పందించిన ఎంపీడీఓ రాజు మంగళవారం బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరపున రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గోశాల (పశువుల షెడ్) మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కార్యదర్శి జె.అయ్యన్న, పశు వైద్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.